
**వెనక దగా, ముందు దగా! కుడి ఎడమల దగాదగా! దోపిడి వ్యవస్థలో యెటు కదిలినా వత్తిడి, ఏదో రకంగా దోపిడి! అన్యాయమని తెలిసినా రాజీపడక తప్పదు. ఎదుటి పక్షం బలమైనదైనప్పుడు ఒకరూ యెవరు మాత్రం ఎదుర్కోనగలుగుతారు?**




పిల్లలిద్దరూ స్కూలికి వెళ్ళిపోయాక ఆ రోజు మరీ వొంటరిగా అనిపించింది లక్ష్మికి. పొద్దున్నే వంట, పిల్లల్ని స్కూలికి తయారు చెయ్యటం వీటితో తొమ్మిదింటి వరకూ హడావుడిగా వుంటుంది పదిన్నరా పదకొండింటికి భోజనం చేసేసిందగ్గర్నుంచి రోజూ ఈ వొంటరితనం మామూలే కాని రోజూకన్నా యిబ్బందిగా వుంది.

పొద్దున్నే వచ్చి యింటావిడ సరోజిని చెప్పిన కబురు, అది విన్నాక కలిగిన బెదురు.... ఎంత ప్రయత్నించినా మనసులోంచి దూరం కావటంలేదు.

రోజూ మధ్యాహ్నం నిద్దర పోయి కాస్సేపైనా వొంటరితనాన్ని దూరం చేసుకునే లక్ష్మికి ఆ రోజు నిద్దర పట్టడంలేదు దిగులుగా బెంగగా ఎలాగో అనిపిస్తోంది.

* * *

రోజులాగే ఆ వసారాలో చేరారు వచ్చిన వాళ్ళందర్నీ చూసి... "యింకా సరోజిని రాలేదే "అంది ఆ యింటావిడ పార్వతమ్మ. పార్వతమ్మకి పతిదేవుడి మీద, ఆ పెద్ద మేడమీద పూర్తి కంట్రోలుంది. అందువల్ల ఆ వీధి ఆడంగులు పొద్దున్న భోజనాలయ్యాక ఆ యింటి వసారాలో రోజూ సమావేశం అవుతారు. కొంచెం పెద్ద వీధినుంచి మలుపు తిరిగి చిన్న వీధిలా కనపడే ఆ లైనులో పాతిక యిళ్ళల్లోకి పెద్ద యిల్లు, పెద్దకాయం పెద్ద గొంతు గలావిడ పార్వతమ్మే. స్థానబలం. తన బలం రెండూ ఆవిడకి వుండటం వల్ల సాధారణంగా ఆ సమావేశాలకి చిన్న అధికారిణిగా ఆవిడే వ్యవహరిస్తూంటుంది.

పొద్దున్న పనులు, భోజనాలు అయిపోయాక, తిరిగి సాయంత్రం యింటి పని- వంటపని మొదలయ్యేవరకు తీరికే ఆ నాలుగైదు గంటల కాలాన్ని రోజూ ఏమాత్రం విసుగులేకుండా కబుర్లతో గడిపెయ్యగల నేర్పుంది వాళ్ళకి

అంతకుముందే, నెల రోజుల క్రితం ఆ వీధిలోకి తన యిద్దరి పిల్లల్తో సరోజినింట్లోకి కొత్తగా అద్దెకి దిగిన లక్ష్మి వాళ్ళ కబుర్ల కళ్ళల్లోపడి చాలా రోజులైంది.

"కట్టుకున్న మొగుడెవడూ లేట్ట."

"ఎవరో వుంచుకున్నట్టుంది."

"వుంచుకోటయా నా ముఖమా.... రాత్రిళ్ళు ఎవరెవరో వస్తుంటారుట. ఇద్దరు ముగురితో సంబంధం వున్నట్టుంది"

అయితే యిదేదో బజారు వ్యవహారమే నన్నమాట."

ఇలా మొదలైన లక్ష్మి మీద కబుర్లు రోజుకోరకంగా పెరుగుతూ వచ్చాయి ఆ సమావేశపు గ్రూపులో ఒకళ్ళిద్దరు లక్ష్మి యింటికి వెళ్ళి తమని తామే పరిచయం చేసుకుని మరికొంత సమాచారం సేకరించుకొచ్చారు గత వారం రోజులుగా లక్ష్మి విషయమే వాళ్ళ సమావేశాల మెయిన్ టాపిక్ అయింది.

చివరికి రెండురోజుల క్రితం... ఆ చిన్న వీధి గౌరవ ప్రతిష్ట, నీతి నియమాలు కాపాడ్డానికి, తమ పిల్లలు లక్ష్మి పిల్లల్తో కలిసి పాడైపోకుండా వుండటానికి పార్వతమ్మ గ్రూపు ఓ నిర్ణయం తీసుకున్నారు అంతే. వెంటనే లక్ష్మి వుంటున్న యింటావిడ సరోజినిని పిలిచారు పిలిచి సంగతి చెప్పి లక్ష్మి ఆ వీధిలో వుంటే తమ పరువు ప్రతిష్టకి ఎంత ప్రమాదమో చెప్పి వెంటనే లక్ష్మిని ఆ వీధినుంచి పంపించెయ్యటం ఎంత అవసరమో చెప్పి నెల పూర్తయ్యేలోపు, ఫస్టు లోపు ఆ పని చేసెయ్యమని చెప్పారు.

ఆ యింటావిడ పార్వతమ్మ మీద, ఆ యింటి కబుర్ల మీద అంతగా యిష్టంలేని సరోజిని చాలా సేపు వాళ్ళతో వాదించింది. లక్ష్మి పరిస్థితంతా చెప్పి నచ్చచెప్పే ప్రయత్నంచేసినా పార్వతమ్మ బృందంలో ఎవరూ వొప్పుకోలేదు పైగా మంచిగా సరోజిని వాళ్ళమాట వినకపోతే ఈ విషయాన్ని మగవాళ్ళ వరకూ తీసికెళ్ళి యింకా అవసరమైతే మగవాళ్ళద్వారా రిపోర్టులు అవీ యిప్పించాల్సి వస్తుందన్నారు

సరోజిని యింకేం మాట్లాడలేక, మాటాడే అవసరంలేక తిరిగి యింటికి వచ్చేసింది. యిరుగు పొరుగు కలివిడిగా లేకపోయినా, కోపంగా రుసరుసలాడుతుంటే ఎంత యిబ్బందిగా వుంటుందో, ఎంత చికాగ్గా వుంటుందో సరోజినికి తెలియందికాదు.

ఒంటరిగా మగతోడు లేకుండా ఆడది బతకటం, అలా బతకటంలో రోజు

రోజుకి అనుకోకుండా తలెత్తే యిబ్బందులు ఆ నరకం సరోజిని అనుభవంలో లేనివేం కావు. యిల్లుండి. కొద్దోగొప్పో ఆర్థికంగా అండదండలుండి. ఆ వూళ్ళోనే బంధువులు, స్నేహితులుండి.... భర్త పోయిన తర్వాత తను వొంటరిగా గడిపిన ఏడాదిలో ఎన్ని రకాల బాధలు పడిందో సరోజనికి యింకా గుర్తే. ఆ బాధపళ్ళేకే అన్నగార్ని, కుటుంబంతో సహా వొచ్చి తనింట్లో వుండమని బలవంతం చేసి పిలిపించుకుంది

బతుకులో ఈ అనుభవం కొంత, యింటికోసం వచ్చినప్పుడు ఏసంగతి దాచకుండా నిజమంతా తనతో చెప్పినందుకు కొంత లక్ష్మంటే అభిమానం, యిష్టం సరోజినికి

ఇప్పుడీ అమ్మలక్కల మాటలు పుచ్చుకుని లక్ష్మని యిల్లు ఖాళీ చేసెయ్యమని చెప్పాలనిపించటంలేదు కానీ మగవాళ్ళ కల్పించుకోటం, రిపోర్టులు.... అల్లరి యివీ భరించే వోపికా లేదు. ఏం చెయ్యాలో తోచలేదు సరోజినికి.

మనసు వొకవేపు, పరిస్థితి మరోవేపు లాగుతున్నాయి తిరిగి మరోసారి పార్వతమ్మ వాళ్ళింటికెళ్ళి లక్ష్మసంగతి ఇంకోసారి చెప్పి బతిమాలితే అనిపించింది. విశ్లేషించి బయటికి చెప్పలేకపోయినా దానివల్ల ప్రయోజనం వుండదని సరోజిని మనసుకి తెలుసు. ఆ రోజంతా మధనపడి ఏం చెయ్యలేక మర్నాడు పొద్దున లక్ష్మని యిల్లు ఖాళీ చెయ్యమని చెప్పలేకపోయినా, జరిగిన సంగతంతా వివరంగా చెప్పింది సరోజిని.

తనేంచేసింది, లక్ష్మితో ఏంచెప్పింది సరోజినే వొచ్చి చెపుతుందని ఎదురు చూస్తున్నారు పార్వతమ్మ గ్రూపు. లక్ష్మి వుండటంవల్ల ఆ వీధికి జరిగిపోతున్న అన్యాయం ఎంతో నిజంగా వాళ్ళకి తెలియక కాదు. ఏళ్ళతరబడీ అలవాటైన ముఠా తత్వం, తమకి తెలియకుండానే తమలో వున్న విచిత్రమైన యిరుగు, పొరుగు అధికారం.... దాన్ని మూకుమ్మడిగా ప్రదర్శించుకోటంలో వున్న తృప్తి.

ఎంతకీ సరోజిని రాకపోవటం చూసి వాళ్ళల్లో ఒకళ్ళని సరోజినింటికే పంపించారు. వివరాలు మొత్తం తెలియకపోయినా. "యివాళ పొద్దున లక్ష్మితో చెప్పాను." అన్న సరోజిని మాటే వాళ్ళకి ఎంతో సంతోషాన్నిచ్చింది. పిల్లల్నేసుకుని లక్ష్మి ఏం చేస్తుందోనని కాస్సేపు వూహాగానం చేసి. మరి కాస్సేపు మరో పదిళ్ళకబుర్లుచెప్పుకుని ఆరోజుగడిపేశారు.

* * *

ఆలోచిస్తుంటే లక్ష్మికంతా అయోమయంగా వుంది సరోజిని చెప్పిన విషయం. తనిప్పుడు ఏంచెయ్యాలి అనేకాదు జీవితం నడుస్తున్న తీరు. అకారణంగా అనుభవించాల్సొస్తున్న యిబ్బందులు, అవమానాలు యివన్నీ అయోమయంగానే వున్నాయి. తనపట్ల జరుగుతున్నది సరైంది కాదని తెలిసినా ఎదిరించలేని బలహీనత ఎప్పట్నించో వుంది. ఏదో కారణం, ఏదో అవసరం ఎప్పటికప్పుడు మనసుని కమ్మేస్తున్నాయి. ఇంకా ఎంతకాలం యిలా మధనపడుతూ ఈ బతుకునిలా గడపాలో అనిపించింది లక్ష్మికి.

ఇలు ఖాళీ చెయ్యటమంటే మరో నాలుగిళ్ళు వెతుకుతూ తిరగటం. మరో పదిమందికి తన సంగతంతా చెప్పుకుని వాళ్ళు చూసే చూపులు, వాళ్ళనే రకరకాల మాటలు, వాళ్ళు చూపించే వ్యంగ్యం యివన్నీ భరించాలని తెలుసు. ఈ ఇల్లంత వీలుగా పిల్లల స్కూలికి దగ్గరగా మరో యిల్లు అంత తేలిగ్గా దొరకదని తెలుసు. యివన్నీ తెలిసినా లక్ష్మిని మరో సంగతి వీటన్నిటికన్నా ఎక్కువగా కలతపెట్టింది. నా బతుకుమీద ఎందుకు వీళ్ళందరికీ యింతకోపం.... ఎవరి విషయం అనవసరంగా పట్టించుకోకుండా నా బతుకు నేను బతుకుతుంటే, యీ యింట్లో వుండటం యింటి వాళ్ళకి నాకు ఏమాత్రం యిబ్బంది లేకుండా వుంటే అనవసరంగా మిగిలిన వాళ్ళకి ఎందుకు లక్ష్మికా విషయం కలతగానే వుండిపోయింది తప్ప సమాధానం ఏం దొరకలేదు.



గాథావళి:

## ఇదింకా బాగుంటుంది!



డాక్టర్ రాంగేయ్‌రాఘవ్‌కు సిగరెట్లు కాల్చడం బాగా అలవాటు. రాజేశ్వర ప్రసాద్ చతుర్వేది అనే రచయిత పొగత్రాగడంవల్ల కలిగే నష్టాలను గురించి ఒక వ్యాసం వ్రాశాడు. దానిని అతడు రాంగేయ్ రాఘవ్‌కు చూపించాడు. డాక్టర్ రాంగేయ్ రాఘవ్ దాన్ని చదివి "ఈ వ్యాసం చాలా బాగుంది. ఈ సిగరెట్టు ఒకసారి త్రాగిచూడు - వ్యాసం కంటె చాలా బాగుంటుంది" అని అన్నాడు.

సేకరణ : ఐ. సూర్యనారాయణ

ఇలాంటివి యివాళ కొత్తకాదు జీవితంలో చాల సార్లు జరిగాయి. సత్యమంటే తను యిష్టపడినప్పుడు, అతనితో జీవితం పంచుకుంటానన్నప్పుడు. నిజానికి దానివల్ల ఎవరికీ ఏ యిబ్బంది లేకపోయినా తల్లీ తండ్రీ తనవేపు బంధువులు, అతనివేపు బంధువులు అందరూ ఎంతోయిబ్బంది పడిపోయి, నానాఅల్లరీ చేశారు. కులం వొకటి కాదని, యిద్దరూ నాటకాలేసి బతికే బతుకేమిటని రకరకాల గొడవ "ఇప్పుడు వయసు వేడిమీద తెలియటంలేదు. తరవాత అనుభవిసావని" తిట్టారు. కులం కానివాణ్ణి చేసుకోటం, నాటకాలెయ్యటం ఆడదానికి తగినపని కాదన్నారు వాళ్ళు చెప్పింది వినకపోతే జీవితంలో నానా యాతనా పడతావన్నారు.

ఇప్పుడు యాతనపడుతున్నది వాళ్ళొనాడు చెప్పింది వినకపోవటంవల్ల కాదని లక్ష్మి మనసుకి స్పష్టంగా తెలుసు. తమ యిష్టానికి దగ్గరగా సత్యం, తను బతకాలని ప్రయత్నం చెయ్యటంవల్లా కాదని తెలుసు.

బతుకులో వుండాల్సిన సరైన విలువలు లేకపోవటం. ఎంతో ఆదరణ లభించాల్సిన వాటికి ఏమాత్రం ఆదరణ లేకపోవటం. చాలామంది జీవితాల్లో దరిద్రాన్ని దూరం చెయ్యటానికి ఏమాత్రం సాయపడని ఆర్థికస్థితిగతులు యివన్నీ తన జీవితంలో ఏ రూపంలో వున్నాయో లక్ష్మికి తెలుసు.

అనారోగ్యంవల్ల, సరైన వైద్యం చేయించుకోలేకపోటంవల సత్యం చచ్చిపోయినప్పుడు బంధువులెవరూ సాయంగా రాకపోటం అలా వుంచి, ఆ తరాత కూడా ఏదో తమ కసి తీరుతున్నటు సూటీపోటీ మాటలనటమే మరీ చిత్రంగా తోచింది. సత్యం పోవటంతో తనలోని వుత్సాహం, శక్తీ కూడా చాలావరకు చచ్చిపోయినట్టనిపించింది లక్ష్మికి.

అక్కడి వాతావరణం, జనం ప్రవరన భరించలేక ఒల్లల్లో యీ వూరు మకాం మార్చినా పరిస్థితి పెద్దగా మారలేదు. స్నేహితుల ద్వారా, పరిచయస్తుల ద్వారా తప్పుడు విలువలు, అనవసర ప్రచారాలు యిక్కడా తప్పలేదు ఆశగా ఏదో సాధిద్దామని సత్యంతో కలిసి మొదలెట్టిన నాటకాల్ని బతుకుతెరువుగా మారుకోవాలన్న వుద్దేశమూ నెరవేరలేదు. వేషాలేసి పిల్లల్ని పోషించుకోగలనన్న లక్ష్మి ధైర్యమూ ఎన్నాళ్ళో నిలవలేదు పసిపిల్లల్ని చూసే దిక్కు లేకపోటం.... వొంటరిగా వున్న ఆడదానిమీద జరగాల్సిన శారీరక, మానసిక బలవంతాలన్నీ తనమీద జరగటంతో లక్ష్మిలో బతుకుమీద మిగిలిన ఆసక్తి పూర్తిగా చచ్చిపోయింది. ఇప్పుడు లక్ష్మికా మిగిలింది.... పిల్లలు.... వాళ్ళకి తల్లిగావున్న తన అవసరం.

తనచుట్టూవున్న జనంమీద బతుకుమీద వున్నట్టే లక్ష్మికి తన శరీరంమీద కూడా చిరాగ్గా వుంటోంది. పూర్తిగా బతుక్కి కావాల్సిన అవసరాలు తీర్చే సామాగ్రిలా మారిన తన శరీరమంటే తనకే అయిష్టంగా వుంటోంది. కానీ చాలా అయిష్టమైనవి భరించినట్టే దాన్నీ భరించటం, పోషించటం, ఉపయోగించటం తప్పటం లేదు.

ఇలా బతుకుతున్న జీవితంకన్నా, యిలా బతకటంతప్ప మరో దారేం లేకుండా చేసిన చుట్టూ జనంమీద, జీవితం మీద అసహ్యం ఎక్కువవుతోంది.

* * *

లక్ష్మింటికి రంగమ్మొచ్చి గంట దాటింది అంతసేపు రంగమ్మ మాట్లాడిన మాటల్లో తోడు, సాయం, ధైర్యం, వోదార్పు వీటన్నింటికన్నా.. "నీకేం పరవాలేదు నా యింట్లో వుండువుగాని..." అని రంగమ్మ అన్నమాటే ఎక్కువగా లక్ష్మి మనసుని పట్టుకుంది.

ఆ సాయంత్రమే వెళ్ళి రంగమ్మ యిల్లు చూసింది. ఆ వీధిలోనే చివరిల్లు. తనకి రంగమ్మ యిస్తానన్న భాగం వో గది, చిన్న వంటిల్లు. వుంటున్న యిల్లంత సౌకర్యంగా, విశాలంగా లేకపోయినా ఏదో తలదాచుకోటానికి పరవాలేదనిపించింది. తప్పదనుకున్న పెద్ద యిబ్బంది దూరమైనట్టు మనసు తేలికపడింది. ఆ యింట్లోకి మర్నాడే మారిపోదామని నిశ్చయించుకున్నాక చిన్న అనుమానం వొచ్చింది లక్ష్మికి. అదే రంగమ్మతో అంది మరి ఈ వీధి ఆడవాళ్ళు నా గురించి చేస్తున్న గొడవ" అని.

"ఎవరు పార్వతమ్మ వాళ్ళైనా వాళ్ళ బెంగ నీకేం అఖ్ఖర్లేదు. నా సంగతి వాళ్ళకి బాగా తెలుసు. అయినా నా బతుక్కి ఈ యిల్లుతప్ప మిగిలి వచ్చిందేవుంది. యింటిని వాళ్ళు చేసేది ఏం లేదు నీకు వాళ్ళ భయమేం అఖ్ఖర్లేదు "నే చూసుకుంటాగా" అని అభయమిచ్చింది రంగమ్మ.

లక్ష్మి యిల్లు మారాక యింకా చాలా రకాల అభయాలిచ్చింది రంగమ్మ. ఇప్పుడు లక్ష్మి దగ్గరకొచ్చి చూస్తున్న మనిషి చూట్టం మానేస్తే, కొత్తవాణ్ణి మరింత మంచివాణ్ణి చూపిస్తానంది. నాటకాల్లో వేషాలొస్తే కాదనకు, పిల్లల్ని నే చూస్తానంది. పోతే లక్ష్మి అన్ని రకాల ఆదాయాల్లోనూ తన వాటా ఎంతో కూడా ఖచ్చితంగా చెప్పేసింది మంచితనం అని అంతవరకు ఆశపడ్డ లక్ష్మికి అది విన్నాక మనస్సు చివుక్కుమంది.

"నే ననుభవిస్తున్న యీ కష్టాలు, నికృష్టాలు నా పిల్లలు అనుభవించకూడదు. నాలోవున్న యింత పిరికితనం, బలహీనత వాళ్ళల్లో వుండకూడదు. అలా పెంచాలి వాళ్ళని." అని లక్ష్మిలో మనిషి కుండాల్సిన నీతి నిజాయితీ పట్ల వున్న వుద్దేశం మరింత బలపడింది.

ఆ యింటికి అద్దె ఎక్కువని తెలిసినా, తన సంపాదనలో రంగమ్మ అడిగిన వాటాకూడా ఎక్కువేనని తెలిసినా వొప్పుకోక తప్పలేదు తనకన్నా ఎదుటి బలం ఎంత ఎక్కువో ఎప్పుడో అర్థమైంది లక్ష్మికి.